అటవీ భూముల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే

అటవీ భూమి హద్దులు పక్కాగా నిర్ణయించాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 20 : జిల్లాలో అటవీ భూమి హద్దులను పక్కాగా ఏర్పాటు చేయాలని అటవీ పరిరక్షణ కమిటీ చైర్మన్, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశంను ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న భూములను గుర్తించి వాటికి సరిహద్దులు నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. అటవి భూములకు హద్దులు లేకపోవడం వల్ల గ్రామస్తులు అటవీ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అటవీ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్, సర్వే, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించి అటవీ, రెవెన్యూ ప్రాంతాలను గుర్తించి సరిహద్దులను నిర్ణయించాలన్నారు. ఈ సరిహద్దులు గుర్తించడం ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యను పరిష్కరించాలన్నారు. కృష్ణ నదిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎఫ్ఓ సతీశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● డీఎస్పీ రవి

నెమ్మికల్ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఆత్మకూర్.ఎస్, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ రవి అన్నారు. బుధవారం ఆత్మకూర్.ఎస్, గట్టికల్, నెమ్మికల్ గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూప్ అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అభ్యంతరకర, అశ్లీలమైన, ఇతరుల మనోభావాలను కించపరిచేలా పోస్టులు చేసిన సభ్యుడితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● జిల్లా తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

సాయికృష్ణా రెస్టారెంట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

సూర్యాపేట రూరల్, మార్చి 20 : నిత్యావసర వస్తువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కృష్ణ అన్నారు. బుధవారం ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ పరిధిలోని రాయిన్‌గూడెం గ్రామ సమీపంలో గల సాయికృష్ణా రెస్టారెంట్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌పై రూ.5, బిస్కెట్లు, చిరుతిండ్ల ప్యాకెట్లపై ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకుంటున్నట్లు తేలడంతో షాప్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, మార్చి 20 : ఉపాధ్యాయ నియామకాలు (డీఎస్సీ) ఉచిత కోచింగ్ శిక్షణ కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందించడం జరుగుతున్నదని, వంద మందికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 26 వరకు ఆన్‌లైన్ ద్వారా షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు రెండు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణకు డైట్, బీఈడీతో పాటు టెట్ అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు tsstudycircle.co.in నందు నమోదు చేసుకోవాలని, వివరాలకు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సిహెచ్.రాములు 9989129935 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది
★ బీరప్పు నాగేశ్వరరావు S/o. యల్లయ్య, గ్రామం: వీర్లపాలెం, మం।। దామరచర్ల. నాకు సంబంధించిన ల్యాండ్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1852/2016 గలది మిర్యాలగూడ నుండి హౌసింగ్ బోర్డుకు ఆటోలో వస్తుంటే పోయినది. దొరికినవారు సంప్రదించగలరు. 9440136907. NT-0000

FLAT FOR SALE
★ Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477. NT-327957

PLOT FOR SALE
★ 5th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436. NT-327974

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డాక్యుమెంట్ పోయినది
★ మందపు రవీన్, తండ్రి: లేట్ వాసుదేవ్, నివాసం: మీయపాగ కాలనీ, నల్లగొండ. మా తండ్రిగారు ఖరీదు చేసిన ప్లాట్ నెం. 8, సర్వే నెం. 740, విస్తీర్ణం 280.00 చదరపు గజములు = 234.11 చదరపు మీటర్లు, నల్లగొండ మండలం & జిల్లా డాక్యుమెంట్ నెం. 4629/1992 గలది పోయినది. దొరికినవారు ఈ క్రింది నెం.కు సంప్ర. 9985187567. NT-00000

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, ర్రా చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తొలుపునూరి: 9182777638

కోరలు చాచిన కరువు..తల్లడిల్లుతున్న ప్రజలు

● ఎండిన చెరువులు.. అడుగంటిన భూగర్భ జలాలు
● ఆశలు సన్నగిల్లి పాలాల్లో పశువులను మేపుతున్న రైతులు

పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ వద్ద నీటి కోసం ట్యాంకర్ వద్ద క్యూ కట్టిన ప్రజలు



పాలకవీడు మండలం మూసీఒడ్డు సింగారంలో ఎండిపోతున్న వరి పొలంలో మేస్తున్న గొర్రెలు

నేరేడుచర్ల, మార్చి 20 : వర్షాభావ పరిస్థితుల్లో ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తున్నది. ఏ ఊరు చూసినా నేడు గ్రామాల పరిస్థితి దయానీయంగా మారింది. ఎప్పుడూ కళకళలాడే సాగర్ ఆయకట్టు పరిస్థితి నేడు మరీ దారుణంగా తయారైంది. వర్షాలు లేక పోవడం, సాగర్ నీరు విడుదల కాకపోవడంతో చాలా వరకు చెరువులు అడుగంటి కనిపిస్తున్నాయి. మార్చి మొదటి వారంలోనే భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కటకటలాడే పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంటలు సాగునీరు లేక చివరి దశలో ఎండిపోతున్నాయి. దాంతో చేసిదేమీ లేక పశువులు, గొర్రెలను మేపుతున్నారు. మార్చి నెలలోనే ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2014కు ముందు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో వర్షాలు లేక కరువు తాండవించింది. గత సీఎం కేసీఆర్ ముందుచూపు, 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సాగు, తాగునీటి కోసం ఎటువంటి ఇబ్బందులు కలుగలేదు. తిరిగి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి నీటి కష్టాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పాలన అంటేనే కరువు అని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాల్లో తాగు, సాగు నీరు ఎద్దడి రోజు రోజుకు పెరుగుతున్నది. ఇప్పటికే చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోవడంతో తాగునీరు సమస్య మరి తీవ్రంగా మారింది. కృష్ణ పట్టే ప్రాంతంలోని ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే బోరు బావులు సైతం సగానికి పైగా ఒట్టి పోవడంతో అధికారులు నీటి ట్యాంకుల ద్వారా తరలిస్తున్నారు. నూతనంగా 200 నుంచి 500 ఫీట్ల లోతు బోర్లు వేసినా చుక్క నీరు రాకుండా పోవడంతో ఆందోళన చెందుతున్నారు. దాంతో రైతులు ఆగమ్యగోచరంలో ఉన్నారు. రానున్న రోజుల్లో సాగునీరే కాక తాగు నీటి సమస్య జటిలం కానున్నది.

బిందెలతో మహిళల కష్టాలు షురు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ఆడబిడ్డలు నీటి కోసం కష్ట పడొద్దని, బిందెలు పట్టుకుని రోడ్లపైకి రాకూడదని మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించారు. కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుచూపు లేకపోవడంతో తిరిగి మహిళలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో వస్తున్న నీళ్ల ట్యాంకర్ల వద్దకు, వీధుల్లోని కులాయిల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి కోసం మహిళలు బిందెలు పట్టుకుని క్యూలో నిలబడే పరిస్థితులు మళ్లీ తలెత్తాయి.

పశువులకు మేతగా వరి పైరు

దశాబ్దం క్రితం కనిపించిన కరువు మళ్లీ తాండవిస్తున్నది. ఓవైపు సాగర్ నీరు విడుదల కాక, మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు విలయ తాండవం చేస్తున్నది. భూగర్భ జలాలు సైతం అండుగంటడంతో సాగునీటి సమస్య నెలకొన్నది. బోరు, బావుల్లో నీరు లేకపోవడంతో రైతు లు ఆరు గాలం కష్టపడి పండించిన పంట చివరి దశలో ఎండి పోతున్నది. పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతుల బాధలు వర్ణనాతీతం. గత ప్రభుత్వం సాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజీలో నీరు ఉన్నప్పటికీ విడుతల వారిగా నీటిని విడుదల చేసి యాసంగి పంటకు ప్రాణం పోసింది. దాంతో రైతులు పండగ వాతావరణంలో పంటలు సాగు చేశారు. కాని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవడంతో నీరు లేక ఎండి పోతున్న పొలాలను చూసి దిక్కుతోచని స్థితిలో రైతులు వరి చేలను పశువులు, గొర్రెల మేతకు వదిలి వేస్తున్నారు.

మూడు ఎకరాల పొలం ఎండింది

వానాకాలంలో పది ఎకరాల్లో వరి సాగు చేయగా మొత్తం పంట చేతికి వచ్చింది. కానీ యాసంగిలో కేవలం ఆరు ఎకరాల్లో వరి సాగు చేయగా నీరు లేక మూడు ఎకరాల పొలం పూర్తిగా ఎండిపోయింది. కనీసం పెట్టిన పెట్టుబడి సైతం రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రెండు పంటలకు నీరు వచ్చింది. పండుగ వాతావరణంలో వ్యవసాయం సాగు చేశా. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– శానం కిరణ్‌కుమార్, రైతు, బక్కయ్యగూడెం

కనుల పండువగా కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆలయంలో కొలువైన కోదండ రాముడు

కోదాడ రూరల్, మార్చి 20 : కోదాడ పట్టణ ప్రధాన రహదారిపై కోదండ రామాలయంలో బుధవారం దేవానంద్ జీయర్ స్వామి చేతుల మీదుగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, సంప్రోక్షణ, మహా పూర్ణాహుతి, గర్భాలయ ప్రవేశం నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తజనం తరలివచ్చింది. పట్టణంలోని పలు సెంటర్లలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. డీఎస్పీ దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, శానం పూడి సైదిరెడ్డి, ఆలయ ధర్మకర్త నాగబండి రంగా దంపతులు పూజలు చేశారు.

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్వామి వారికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మునగాల, మార్చి 20 : రాష్ట్రంలో రెండో వేదాద్రిగా పేరుగాంచిన మండల పరిధిలోని రేపాల గ్రామంలో గల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా స్వామివారు నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామం నుంచి రేపాల గ్రామానికి చేరుకోగా గ్రామస్తులు గ్రామ పొలిమేరల నుంచి ఘన స్వాగతం పలికారు. ఈ 21న అధ్యయనోత్సవం, 22న పరమ పదోత్సవం, 24న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సారిక రామయ్య తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

విద్యార్థులతో ఏహెచ్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

చింతలపాలెం, మార్చి 20 : మండలంలోని దొండపాడు గ్రామంలో గల అరుణోదయ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు చదువు సాహాయం కోసం బుధవారం ఏహెచ్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నపురెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి రూ.2,94,000 స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు సైదులు, దొంగల కార్తీక్, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నది.

లాల్‌సింగ్‌తండా పాఠశాలలో స్వపరిపాలన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

పెన్‌పహాడ్, మార్చి 20 : మండల పరిధిలోని లాల్‌సింగ్‌తండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరి పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు అధ్యాపకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులుగా అలరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గవాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు నిర్మల పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

సూర్యాపేట లీగల్, మార్చి 20 : రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న జరుగనున్నాయి. ఈ 21న నామినేషన్ వేయడానికి చివరి రోజు కావడంతో అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, గేమ్స్ సాంస్కృతిక కార్యదర్శి,
కార్యవర్గ సభ్యుల పదవులకు పలువురు న్యాయవాదులు నామినేషన్లు సమర్పించారు.

తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

తిరుమలగిరి, మార్చి 20 : తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజినీపై అవిశ్వాసం నెగ్గింది. బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అధ్యక్షతన చైర్‌పర్సన్‌పై ఆవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 15 మంది సభ్యులకు గాను 12 మంది సభ్యులు, ఎక్స్ అఫిసియో సభ్యుడిగా ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. మొత్తం 13 మంది సభ్యులు చేతులు లేపడంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

నేడు పెన్‌పహాడ్ మండల సర్వసభ్య సమావేశం

పెన్‌పహాడ్, మార్చి 20 : మండల సర్వ సభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వాహన తనిఖీలో నగదు పట్టివేత

పెన్‌పహాడ్, మార్చి 20 : వాహన తనిఖీలో నగదు పట్టుబడిన ఘటన మండలంలోని దూపాడ్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీలో భాగంగా ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.94,200 తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్ టీమ్‌కు అప్పటించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోదాడ రూరల్, మార్చి 20 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని మంగలితండా శివారు పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను దొరకుంట శివారులో పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి బుధవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

గొడ్డలి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మేళ్లచెర్వు, మార్చి 20 : గొడ్డలితో దాడి చేసిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన గోపి శెట్టి శంకర్‌కు చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన షేక్.శంషద్‌తో కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి పాద్దుపోయాక స్థానిక శివాలయం ఎదుట గాలి మిషన్ వద్ద బైక్‌పై ఉన్న శంషద్‌పై శంకర్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో శంషద్ చెవి వెనుక తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం కోదాడ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

అర్వపల్లి, మార్చి 20 : మండల పరిధిలోని తిమ్మాపురంలో గోపాల్‌రెడ్డినగర్ వద్ద ఇటీవల ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో గంట యల్లమ్మ మృతి చెందింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బొడ్డు లక్ష్మణ్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో తిమ్మాపురంలో ఆటో యూనియన్ సభ్యులంతా కలిసి బుధవారం వైద్య ఖర్చుల కోసం లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు బుధవారం రూ.10 వేలు అందజేశారు.

జాతీయ కబడ్డీ పోటీలకు కోదాడ క్రీడాకారుడు

జాతీయ జట్టుకు ఎంపికైన కోదాడ వాసి సంతోష్

కోదాడ రూరల్, మార్చి 20 : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కోదాడ గోల్డెన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుడు సంతోష్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నామ నరసింహారావు బుధవారం తెలిపారు. మహారాష్ట్ర అమిత్ నగరంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే 70వ సీనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సంతోష్ పాల్గొననున్నట్లు చెప్పారు. సంతోష్ ఎంపికకు సహకరించిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్, కె.జగదీశ్, జిల్లా అధ్యక్షుడు రామచంద్రగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోశ్‌కు పట్టణ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఎస్‌కే బాగ్దాద్, రవీందర్‌రెడ్డి, రామసాని రమేశ్, ఎస్‌కే ఇమామ్, శివనాథరెడ్డి, నాగిరెడ్డి, రమేశ్ బాబు, వెంకట్‌రెడ్డి, తిరపయ్య అభినందనలు తెలిపారు.

తేనెటీగల పెంపకంతో యువతకు స్వయం ఉపాధి

● గడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

గరిడేపల్లి, మార్చి 20 : తేనెటీగల పెంపకం ద్వారా యువత స్వయం ఉపాధిని పొందవచ్చునని గడ్డిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ ఎం.కె.సుకుమార్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ, వ్యవసాయ శాఖ ఆర్థిక సహకారంతో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, సేంద్రీయ వ్యవసాయంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేనెకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున మంచి ఆదాయంను పొందే అవకాశం ఉన్నదన్నారు. ఎస్‌బీఐ ద్వారా అందజేసే సబ్సిడీలు, లోన్లను యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎ.కిరణ్, డి.ఆదర్శ్, టి.మాధురి, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేర నివారణపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లోకేశ్

సూర్యాపేట అర్బన్, మార్చి 20 : సైబర్ నేరాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వన్‌టౌన్ ఎస్ఐ లోకేశ్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొబైల్, కంప్యూటర్లు ఉపయోగించే టప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు గ్రామాల్లోని ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రిన్సిపాల్ వెంకటేశులు, కానిస్టేబుళ్లు రాంబాబు, రమేశ్, రవినాయక్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడ్డ గీత కార్మికుడు మృతి

ఆత్మకూర్.ఎస్, మార్చి 20 : మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన యర్రగాని వెంకన్న (54) శనివారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడడంతో మెడ నరాలు తెగిపోయి, కాళ్లు చేతులు స్పర్శ లేకుండా పోయాయి. చికిత్స కోసం సూర్యాపేటకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. వెంకన్న భౌతికకాయాన్ని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు సందర్శించి నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, తండు రమేశ్, నోముల వెంకన్న, సొసైటీ అధ్యక్షుడు కాట్ల వెంకన్న, మామిడి లింగయ్య, యర్రగాని నారాయణ, ఉయ్యాల మల్సూర్, శ్రీను, పాండయ్య, ఉపేందర్, లింగమల్లు, సురభి సైదులు, ఎరుకల లింగయ్య ఉన్నారు.

'నేటి పంచాంగ ఆవిష్కరణను జయప్రదం చేయండి'

నేరేడుచర్ల, మార్చి 20 : హైదాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో గురువారం నిర్వహించే క్రోదినామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణను జయప్రదం చేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబొట్ల ఫణికుమార్‌శర్మ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించే పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అర్చక సంఘం రాష్ట్ర ప్రతినిధులు హాజరవుత